

# కంకాళం

వి. ప్రతిమ

అనంత నిశ్శబ్దాన్ని చీలుస్తూ హోరుగాలి... భయం గొల్పుతూ... తూరుపు గేటు బయట చిందరవందరగా పడివున్న చెరుకుపిప్పిలో నుండి నడుస్తూ ఉలిక్కి పడిందామె... ఎంతోకాలం నుండి కుప్పలుకుప్పలుగా పోసి వున్న దానికి గుర్తుగా ఆ చెరుకుపిప్పి ఎండి, ఎండి... గలగలలాడుతూ ఎడాపెడా కాళ్లకు అడ్డం పడుతోంది.

ఆ శబ్దానికి గేటువారగా ముడుచుకుని పడుకుని వున్న కుక్కపిల్ల ఒకటి నిద్రలేచి కుయ్యికుయ్యిమంటూ అరవసాగింది. అప్పటిదాకా బురదగుంటలో పొర్లినందుకు గుర్తుగా దాని ఒళ్లంతా తడిచి బురద అంటుకుని వుంది. గేటు బయట తలలు విరబోసుకుని నిలుచున్న చింతచెట్టు మూలంగా సాయంత్రం నాలుగ్గంటలకే చీకట్లు కమ్మేసినట్లుగా వుంది...

గలగలలాడుతోన్న చెరుకుపిప్పిలో నుండి పిల్ల పామొకటి సరసరా పాకి గేటు పక్కనున్న గోడ మీది నుండి లోపలికి జారిపోయింది...

భయంతో, దిగ్భ్రాంతితో ఆమె నరాలు ముడుచుకున్నాయి... అప్రయత్నంగా కుడిచేయి కొడుకు భుజాన్ని తాకింది.

అయినా ఆగకుండా యిద్దరూ లోపలికడుగు పెట్టారు.

గేటు వద్ద నుండి కర్మాగారం భవంతి చాలా దూరంలో వుంది... ఒకప్పుడు నున్నగా, నల్లగా మెరిసిపోతుండిన తారురోడ్డు అక్కడక్కడా గుంటలుపడి... ఆ గతుకుల్లో నుండి మొలిచిన పిచ్చిచెట్లు దుబ్బులు దుబ్బులుగా తమలో ఎన్నో పిల్లపాముల్ని, పురుగూ పుట్రాని దాచుకుని భయంగొల్పుతున్నాయి.

ఈ గేటుగుండా... ఈ తారురోడ్డు మీద ఎన్నెన్ని ట్రాక్టర్లూ, ఎన్ని చెరుకు నిండిన లారీలూ, ఎంతెంత మంది రైతులూ, వందలమంది ఉద్యోగులూ, తాత్కాలికంగా వున్న కార్మికులూ... ప్రతీరోజూ ఒక పెళ్లి జరిగినట్లు సందడి సందడిగా వుండేది. గేటు బయట మెయిన్‌రోడ్డు మీద కూడ ఫర్లాంగుదూరం దాకా చెరుకు నిండిన ట్రాక్టర్లు నిలిచిపోయి వుండేవి. అటువంటిదిప్పుడు ఈ చీకటిలాంటి నిశ్శబ్దం, నిర్మానుష్యం గుండెని తరుగుతున్నట్లుగా వుంది.

పాతికేళ్ల ముందు ఈ ఫ్యాక్టరీ పెట్టడానికి రైతు సోదరులూ, రాజకీయ నాయకులూ అంతా కలిసి ఊరూరా తిరిగి రైతులందరినీ ఒప్పించి ఈ కర్మాగారంలో వాటాదారులుగా చేర్పించడం... ఆమెకింకా కళ్ల ముందు జరిగినట్లే వుంది. అందులో తన తండ్రి కూడా ఒక వాటాదారు. చుట్టుపక్కలంతా మెట్టనేలలే కావడంతో, అప్పటికే రైతులు వేరే పంట కోసం చూస్తుండడంతో చెరుకు వేయడానికి సుముఖత చూపించారు. ప్చ్‌ః అదంతా ఒక కాలం...

అప్పటిదాకా చింతచెట్టు మీద నివాసమున్న గుడ్లగూబ ఒకటి వికృతంగా అరిచి ఆలోచనలో వున్న ఆమె తలని తాకుతూ పారిపోయింది.

*

"ఒక్కొక్కటి చేస్తుంటాడు... అన్నీ అయిపోయినాయి... ఇప్పుడిదెత్తుకున్నాడు..." చేటలోని బియ్యాన్ని రెట్టింపు శబ్దం వచ్చేలా చెరుగుతూ తనలోతాను గొణుక్కుంది రత్నమ్మ.

ఆ చెరగడం తాలూకూ విసురు ఆరుబయట కప్పులేని స్నానాలగదిలో స్నానం చేస్తున్న భర్తకి వినపడా లనే ఆమె ఉద్దేశ్యం. బియ్యం కడిగిపెట్టి ఎసరు కింద ఎక్కేసి మరికొన్ని కట్టెపేళ్లు ఏరుకు రావడానికి గడ్డివామి పక్కకెళ్లింది. వామి మీద కప్పిన ముళ్లకంపలు గీరుకుని చేతిమీద రక్తమొచ్చింది.

రత్నమ్మకి చిరాకేసింది... తమ పెళ్లయిన కొత్తలో ఈ దొడ్లోనే ఎన్నెన్ని పుట్ల ధాన్యం కూట్లు కట్టి వుంచే వాళ్లు... అయిపుట్ల వడ్లన్నీ ఆరుబయటుంచి కూడ ఏనాడూ వాటి మీద ముళ్లకంపల్ని కాపలా వేసుకోవ లసిన అవసరం రాలేదు. ఇప్పుడేమొ ఉత్తగడ్డిని కాపాడు కోవడానికి ఇన్ని అవస్థలు. చిరాగ్గా చీరుకుపోయిన ముళ్లకంపల్ని లాగి పక్కకి విసిరి మళ్లీ పొయ్యి వద్దకు వచ్చింది.

అప్పటికి స్నానం పూర్తిచేసిన రాఘవయ్య రత్నమ్మని చూసి ఒకింత జంకుతూనే లోపలికెళ్లాడు. భర్త లోపలికి వెళ్లిందాకా సాలోచనగా చూసి దీర్ఘంగా నిట్టూర్చింది.

రత్నమ్మకి తాము నలుగురితోపాటుగా బతకలేక పోతుండామే అని మనోవేదన. అందరిలా నాలుగు వస్తువులూ కొనుక్కుని సుఖంగా వుండాలని ఆశ... తమ చుట్టాలందరిలోనూ తామే తక్కువగా వున్నామని మధన. బతుకిట్లా పేలవంగా అయిపోవడానికి కారణం భర్తేనని ఆమె పూర్తి విశ్వాసం.

అయితే రాఘవయ్య, రత్నమ్మ అనుకునేంత చాతకానివాడు, తెలివితక్కువవాడు ఏంకాదు. ఇదే పదెకరాల్లో వ్యవసాయం చేసే ఇద్దరు కూతుళ్లకి పెళ్లిళ్లు చేసి పంపించాడు... వాళ్ల మరవళ్లూ, సరవళ్లూ, మంచీచెడ్డా, కానుపులూ అన్నీ చూశాడు. కొడుకుని కాలేజీలో చేర్పించాడు. అప్పుడు పైరు బాగానే పండేది. నీళ్లకి కొదవుండేదిగాదు. ఆ తర్వాత చెనగేస్తే కూడ బాగనే అయ్యేది... తర్వాత్తర్వాత ఎరువులు, విత్తనాలు, నీళ్లు అన్నీ కొనాల్సి రావడంతో ఏ పంటేసినా గిట్టుబాటు కావడంలేదు. రెండేళ్ల నుండీ పైసా చేతికి రాలేదు... కూతుళ్ల పెళ్లిళ్లకీ, పబ్బాలకీ... కొడుకుని కాలేజీలో చేర్చ డానికి చేసిన అప్పులు పాపంలా పెరిగిపోతూంటే మళ్లీ మళ్లీ చెనగేసి చేతులు కాల్చుకోలేక ఈసారి ధైర్యం చేసి మరో కొత్తప్పు పుట్టించి చెరుకు పంటేసినాడు. అదీ రాఘవయ్య చేసిన తప్పు... ప్రస్తుతానికి రత్నమ్మ విసురూ...

అయితే మళ్లీ తనలోతనే చెరుకు పంటేసి చెడి పోయినోడు లేడులే అని సరిపెట్టుకుంది... పోయినేడు, అంతకు ముందటేడు పోగొట్టుకున్నదంతా... అప్పులు... వడ్డీల బాధల్లో నుండి బయటపడ్తాంలెమ్మని ఆశ పడింది... ఆతృతపడింది.

కానీ రాఘవయ్య రత్నమ్మ ఆశించినట్లుగా చెరుకు నరికాడేగాని డబ్బులు చేతికందలేదు... ట్రాక్ట రోళ్లు, కూలోళ్లు ఇంటిచుట్టూ తిరిగిపోతుంటారు... చెరుకు నరకడం ఇక్కడి కూలోళ్లకి చేతకాదని ఆరం బాకం అవతల నుండి కూలోళ్లను పిలవాల్సొచ్చింది. ఆ అరవ కూలోళ్లు మాటలు కాదు అడిగిపోతుంటారు... రాఘవయ్య ఫ్యాక్టరీ చుట్టూ తిరుగుతున్నాడు. రోజులు గడుస్తున్నాయి. పాత వడ్డీలకు కొత్తవి చేరి ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. రత్నమ్మ గుండెలు జారిపోతున్నాయి.

''మన్దగ్గిరేమన్నా డబ్బులుండి ఏసినామా?... ఎప్పుడయినా ఆ మార్వాడీల దగ్గిర తేవాల్సిందే కదా... బ్యాంకులు అప్పులిస్తాయి అంటాడు. వాటి చుట్టూ తిరిగేదెవురు?... తిరిగి తిరిగి తెచ్చుకున్నా ఆ బ్యాంకి అప్పులు కూడ చాపకింద నీళ్ల మాదిరి మనుషుల్ని ముం చేస్తుండె... బ్యాంకులకిప్పుడు అప్పులిచ్చేది ఒక యాపా రమయిపోయుండాది... రైతుల్ని ముంచేదానికి...''

పని చేస్తూ చేస్తూనే గొణుక్కుంటుంది రత్నమ్మ. ఒక్కోసారి పెద్దపెద్దగానే అప్పునీ, వడ్డీని, చెరుకునీ, ఫ్యాక్టరీని అన్నింటిని కలిపి శాపనార్థాలు పెడుతుంది... రత్నమ్మ ఆలోచనల్లో నుండి తేరుకుని అన్నంకుండని లోపల పెట్టొచ్చేసరికి రాఘవయ్య లేడు.

''మళ్లీ బొయినాడు గావాల ఫ్యాక్టరీకి... కాళ్లరి గేట్టు తిరగతుండాడు కావల్సిందేలే ఈయినికి,'' కొరివి కట్టెల్ని బయటికి లాగి విసురుగా ఆర్పుతూ అనుకుంది.

అయితే రాఘవయ్య చక్కెర ఫ్యాక్టరీకి కాకుండా సి.డి.సి ఛైర్మన్ రఘునాథరెడ్డి ఇంటికి పొయ్యాడు... రఘునాథరెడ్డి చెపితే ఫ్యాక్టరీలో డబ్బులు తొందరగా యిస్తారని హరినాథయ్య చెప్పారు... అందుకని రఘు నాథరెడ్డిని బతిమాలకుందామని బయల్దేరాడు...

రఘునాథరెడ్డి పేదా సాదా... మంచీ చెడ్డా, కష్టం నష్టం తెల్సినోడు. అందరినీ గౌరవిస్తాడు... చిన్నచూపు చూడడు... అయినా చిన్నబోతూ, మధనపడుతూ ముందువెనకలాడుతూనే రఘునాథరెడ్డి ఇంటివైపుగా నడుస్తున్నాడు రాఘవయ్య.

*

''బొక్కపడేదాకా దొబ్బి తినేది... తినేప్పుడు పట్టిచ్చుకోకుండా అంతా అయిపోయిన తర్వాత దొల్లని

ఒకటికి సగంగా ప్రైవేటు వ్యక్తులకు అమ్మేసేది... ఎక్కడబట్టినా ఇదేకద సార్ జరగతా వుండేది... పోనీ జరిగిపోయింది... ప్రభుత్వాన్ని కూడ ఎవురయినా ప్రైవేటు వ్యక్తులకప్పగించేస్తే బాగుపడిపోద్ది..." చంద్రశేఖరం రసాయనశాస్త్రంలో పి.జి.ఆనర్స్ చేసినవాడు... చాలాకాలం తణుకు ఫ్యాక్టరీలో కెమిస్ట్‌గా పనిచేసి స్వంతజిల్లాకి రావాలని ఈమధ్యనే వచ్చాడు.

"అసలెందుకు సార్... ఆలోచనలేని పనులేగాని ఇవన్నీ... ఇప్పుడయినా ఫ్యాక్టరీని లాభాల బాటలో నడిపించొచ్చు..."

చంద్రశేఖరం మాటలకి విస్తుపోయి చూశాడు మేనేజరు. మామిడిపండు రసం నిండిన గ్లాసుని అందుకుంటూ రఘునాథరెడ్డి కూడ ఆసక్తిగా చంద్రశేఖరం కేసి చూడసాగాడు.

"అవును సర్..." రఘునాథరెడ్డి వంక చూస్తూ గ్లాసులోని జ్యూస్‌ని ఒక్క గుక్క లోపలికి తీసుకున్నాడు చంద్రశేఖరం... "మనదేశంలో చెరుకు, మొక్కజొన్న ఇంత విస్తారంగా పండుతున్న దానికి ఇథనాల్ ఉత్పత్తి చేపట్టామనుకోండి అసలీ పెట్రోల్ సమస్య లేకుండా పోతుంది... బ్రెజిల్ చూడండి. ఇరవైనాలుగు శాతం ఇథనాల్‌తో కూడిన పెట్రోల్‌ని అమ్ముతోంది... బ్రెజిల్ చెరుకు నుండి ఇథనాల్‌ని ఉత్పత్తి చేస్తోంటే అమెరికా మొక్కజొన్న నుండి తీస్తోంది... కానీ మనదేశం మాత్రం మేధావుల్ని ఉపయోగించుకోకుండా వలస పంపుతుంది," వ్యంగ్యమో, దిగులో తెలీనట్లుగా జూస్‌ని గటగటా తాగి శబ్దం వచ్చేలా గ్లాసుని టీపాయ్ మీదుంచాడు చంద్రశేఖరం. ఆ శబ్దానికి అప్పటిదాకా టీపాయ్ మీద వాలివున్న పిచ్చుక ఒకటి కిచకిచా శబ్దం చేస్తూ దాని గూటెలోనికి చేరుకుని ఒక గడ్డిపోచని చంద్రశేఖరం మీదికి విసిరింది.

"అవును నిజమే! నేనీమధ్యే చదివాను. చమురు సంక్షోభం నుండి బయటపడేందుకు బ్రెజిల్ తీసుకున్న నిర్ణయంవల్ల ఆ దేశం పర్యావరణం, వ్యవసాయపరంగానూ ఎంతో లాభపడింది..." మాట నెమ్మదిగా వున్నా చాలా స్పష్టంగా వుంటుంది రఘునాథరెడ్డి గొంతు.

"ప్చ్ఁ" నిట్టూర్చాడు చంద్రశేఖరం. "ఆ దేశం ఇప్పటికే పూర్తిగా ఇథనాల్‌తో నడిచే వాహనాలని ప్రవేశపెట్టింది... మనదేశం రెండువేలా నాలుగు నాటికి కూడా పెట్రోల్లో పదిశాతం మాత్రమే ఇథనాల్ కలపాలని నిర్ణయించుకుంది," ప్రభుత్వం చేతకానితనం మీద నిరసన చంద్రశేఖరం గొంతులో.

పర్చేజింగ్ ఆఫీసరు, మేనేజర్ల లావాదేవీలూ... కుమ్మక్కులూ తెలీకుండా ఏంపోలేదు చంద్రశేఖరానికి. నిజానికతడు వేసిన మొదటి చురక అదే. అందుకే అతడు మాట్లాడుతుంటే మేనేజరు ముఖం గంటు పెట్టుకుని కూచున్నాడు. అతడ్నే గమనిస్తూ రఘునాథరెడ్డి వెనక నిల్చున్న ఫోర్‌మెన్ రవణయ్య లోలోపలే చంకలు గుద్దుకుంటున్నాడు. ఫ్యాక్టరీ ఈ స్థితికి చేరడానికి తనవంతు సాయమేదో తానూ చేశాడు మేనేజరు. ఒకవైపు ఫ్యాక్టరీ దిగజారిపోతుంటే మరోవంక అతడి ఆస్తులు పెరిగిపోవడాన్ని ఫ్యాక్టరీ కొచ్చిన అతి తక్కువ కాలంలోనే గమనించాడు చంద్రశేఖరం.

అవతల రాఘవయ్య వరండాలో కూర్చుని అంతా వింటున్నాడు. అయితే ఎంత ఆలోచించినా వీళ్లంతా ఏం మాట్లాడుకుంటున్నారో అర్థంకావడంలేదతడికి. మనదేశంలో వుండే ఒనరుల్ని ప్రభుత్వం సరిగా వినియోగించుకోవడంలేదనీ, చెరుకు నుండి పెట్రోల్లో కలిపే ఆయిలేదో తీయొచ్చుననీ చెప్పుకుంటున్నారు. సమయానికి మేనేజరు కూడా అక్కడే వున్నాడు. చెరుకు డబ్బులడగొచ్చుననుకున్నాడు.

అప్పటికి సూర్యుడు నడినెత్తిని దాటి పడమరకి మారుతున్నాడు. కడుపులో కరకరలాడుతోంది... 'ఈ వచ్చినోళ్లు తాగనూ, తిననూగా మాట్లాడిందే మాట్లాడుకోనూగా వుండారు...' తనలో తానే మథనపడుతూ ఆరుబయట మొక్కల్లో కిచకిచలాడుతోన్న పిట్టల్ని విసుక్కుంటూ రఘునాథరెడ్డి పిలుపు కోసం ఎదురు చూస్తున్నాడు రాఘవయ్య.

"లేద్సార్! యిదిగాని ప్రభుత్వం ఆలోచించ గలిగితే చెరుకు, మొక్కజొన్న పండించే రైతులకు గిట్టుబాటు ధరలు లభించడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలు బాగా డెవలప్ అవుతాయి సర్... కోట్ల రూపాయల విదేశీమారక ద్రవ్యం మిగుల్తుంది... జీవితాల్ని, ప్రాణాల్నీ కూడా పోగొట్టుకుంటోన్న రైతుల్ని మనం కాపాడుకోగలం సర్," చంద్రశేఖరం గొంతులో, ఆలోచనల్లో ఆవేదన...

గతంలో ఈ విషయాన్ని కేన్ కమీషనర్ డైరెక్టరాఫ్ ది షుగర్స్ దృష్టికి కూడా తీసికెళ్లాడతడు... అత్యంత విలువైన ఆలోచనలన్నీ షరా మామూలుగా బుట్టదాఖలు కావడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. అందుకే ఒక విరక్తితో సొంత జిల్లా కొచ్చేశాడతడు... అయితే అక్కడున్న అందరికీ తెలుసు, ఇదంతా తాము కాలక్షేపానికి మాట్లాడుకుంటోన్న మాటలే తప్ప ప్రభుత్వం దీన్ని

సీరియస్‌గా పట్టించుకోదని... అదంత తేలిగ్గా జరిగే విషయం కాదనీను...

మాట్లాడుకుంటూ అంతా గేటు వంక వెళుతున్నారు.

రాఘవయ్యకెందుకో చప్పున దిగులు కమ్ముకొచ్చింది... తనలాగే ఈ దేశం కూడ చాలా అప్పుల్లో కూరుకుపోయినట్లుగా వుంది. ఇందాకట్నుండీ అంతా అదే మాట్లాడుకుంటుండారు. ప్రపంచబ్యాంకు వడ్డీలు, ఋణాలు అంతా అయోమయంగా అర్థమయ్యీ, కాకుండా వుంది రాఘవయ్యకి. దేశానికి కూడా అప్పులుంటాయా? వాళ్లు కూడా మార్వాడీల మాదిరిగా షరతులు పెడతారా?... వడ్డీలు మింగుతారా?

వాళ్లందరినీ సాగనంపి తిరిగి ఇంట్లోకొస్తూ, "ఏం రాఘవయ్యా?" అంటూ రఘునాథరెడ్డి పలకరిస్తేనే తప్ప తేరుకోలేదు రాఘవయ్య.

అప్పటికి రేగిన ఆకలంతా చచ్చిపోయిందతడి కడుపులో.

*

"అన్నా... ఫ్యాక్టరీని అమ్మేస్తుండారంట గదన్నా?" ఫ్యాక్టరీలో హెల్పర్‌గా పనిచేసే వెంకటేశ్వర్లు దిగులుగా చెప్పాడు. అమ్మేస్తే దాంట్లో పనిచేసే వాళ్లంతా ఏమయిపోతారో అర్థంకావడంలేదతడికి. రాఘవయ్య విస్తుపోయి చూస్తున్నాడు వెంకటేశ్వర్లు కేసి...

"జాతీయస్థాయిలో పురస్కారాలు పొందిన ఫ్యాక్టరీని... ఈరోజుకి కూడా వందకోట్లు చేసే ఫ్యాక్టరీని రెండు కోట్లకి బేరం పెట్టారంటన్నా..." ఏడుస్తున్నాడు ఫోర్‌మన్ రవణయ్య. తమ స్వంత ఆస్తులేవో అమ్ముకుంటున్నట్లుగా వుందతడి పరిస్థితి.

ఆ ఫ్యాక్టరీ పెట్టింది మొదలూ రవణయ్య అక్కడే పనిచేస్తున్నాడు.

లక్షా ఎనభయివేల టన్నుల చెరుకు గానుగాడ్డం తెలుసు రవణయ్యకి. క్రషింగ్ చేయక ఎక్కువయిన చెరుకుని ఫ్యాక్టరీ పర్మిషన్తోనే జిల్లాలో కొత్తగా పెట్టిన మరో ప్రైవేటు ఫ్యాక్టరీకి తోలడం దగ్గర్నుండీ ఆదాయం ఎక్కువయి కార్మికులు కొందరికి జీతాలుకాక ఒకటికి రెండుసార్లు బోనసులివ్వడం దగ్గర్నుండీ... పనెక్కువయి ఎక్స్ట్రా కార్మికుల్ని పెట్టుకోవడం దగ్గర్నుండీ ఇవాళ పర్మినెంటు పనోళ్లనే తీసేసేదాకా... ఇంకా యివ్వాళ రెండు నెలలకోసారి కూడా కార్మికులకి జీతాలివ్వలేని స్థితిలోకి ఫ్యాక్టరీ నెట్టబడ్డందాకా తెలీని విషయమంటూ లేదు రవణయ్యకి.

రొయ్యలగుంటలు దూసుకొచ్చి చెరుకుపంట తగ్గిపోవడం... ఉత్పత్తి తగ్గిన పరిస్థితుల్లో ఫ్యాక్టరీ గాడితప్పడం... ఎక్కడివాళ్లక్కడ గాదె కింద తవ్వుకు తినడం గురించి తెలుసు...

అంతర్జాతీయ ఒప్పందాలగురించి రవణయ్యకు తెలీకపోవచ్చుగానీ ఇక్కడిన్ని చక్కెర కర్మాగారాలు పెట్టుకుని కేంద్రప్రభుత్వం పంచదారను అధికంగా దిగుమతి చేసుకోవడం గురించి తెలుసు. కేంద్రం పదహారు రూపాయలకి కొన్న పంచదారని మార్కెట్లో కిలో పదమూడు రూపాయలకే విక్రయించడంతో మొత్తం ఫ్యాక్టరీల పరిస్థితే అయోమయంగా తయారయింది. గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన చక్కెరను అమ్ముకునే దారిలేక, ఆదాయం లేక రైతులకు చెరుకు డబ్బులివ్వలేక అన్ని పరిస్థితులూ... ఫ్యాక్టరీలో తొలినాటి నుండీ ఇవ్వాళ్టివరకూ జరిగిన అనేకానేక పరిణామాలకు సాక్షీభూతం రవణయ్య...

రవణయ్యకు ఏడవడం కూడా తెలుసు...

అప్పటికే బాగా డీలాపడిపోయున్నాడు రాఘవయ్య. రవణయ్య ఏడుపుతో కడుపులో తిప్పినట్లుగా అయింది. చెరుకు నరికి మూడు నెలలైపోయింది. ఈ తొంభయి దినాల్నుండీ ఫ్యాక్టరీ చుట్టూ, అరవ కొరవా రఘునాథరెడ్డి ఇంటి చుట్టూ తిరిగి తిరిగీ చావయిపోయింది. ఛైర్మన్ చెప్తుంటే మాత్రం ఇవ్వడానిక్కూడా డబ్బులుండాల గదా... ఈలోపల నరికిన చెరుకు మళ్లీ ఎదిగొస్తా వుండాది. చెరుకు నరకాలంటే మళ్లీ కూలోళ్లు, ట్రాక్టర్లూ... తల తిరిగిపోయింది రాఘవయ్యకి. ఇంక కొత్త అప్పు కూడ పుట్టేట్టుగా లేదు.

అసలే మేనెల కాలుస్తోంది.

యాభయ్యేయిదేళ్ల జీవితంలో యిటువంటి ఎండలు యిదివరకెన్నడూ చూడలేదు రాఘవయ్య. దాహానికి మలమల మాడిపోతుండారు జనం. బయట వేడి... లోపల వేడి. చెప్పులరిగేట్టుగా తిరిగి... తిరిగి పదేళ్ల వయసు మీద పడ్డట్టుగా వున్నాడు రాఘవయ్య.

"మనోళ్లంతా ఫ్యాక్టరీ అమ్మేదానికి లేదంటూ స్ట్రయికు చేస్తుండారు," మళ్లీ వెంకటేశ్వర్లే అన్నారు. వెంకటేశ్వర్లు తండ్రి రాఘవయ్యకి మంచి స్నేహితుడు... అంతా ఒకేవీధిలో వుండడంతో ఒక కుటుంబంలోలా వుండేవాళ్లు.

కార్మికులంతా ఆందోళన చేయడం... నినాదాలతో వూరంతా హోరెత్తిపోవడం... రాస్తారోకోలు... అన్నీ రత్నమ్మకు కూడ తెలుసు. వింటూనే వుంది అన్నీ.

"అయితే ఏమయ్యా, అట్టన్న అమ్మేస్తే మంచోళ్ల చేతికి పొయ్యిందంటే రైతులు బాగుపడతారు... చెరుకు నరికిన డబ్బులన్నా వస్తాయి. ఇప్పుడిట్టనే వుంటే ఈ మనుషులు డబ్బుల్యాడ ఇస్తుండారు..." తనకు తెల్సిం దేదో చెప్పబోయింది రత్నమ్మ.

"నువ్వు గమ్మునుండు..." కసురుకున్నాడు రాఘవయ్య.

అయితే రత్నమ్మాశించినట్లుగా ఫ్యాక్టరీ వేరేవాళ్ల చేతుల్లోకి పోలేదు. కార్మిక నాయకుడు వెంకయ్య కోర్టుకు వెళ్లి 'స్టే' ఆర్డరు తీసుకొచ్చాడు.

కర్మాగారం అమ్మకపోవడం బాగానే వుందిగానీ ఇప్పుడు ఫ్యాక్టరీ రెండింటికి చెడ్డ రేవడయి పోయింది.

ఇటు ఉద్యోగాల్లేక కార్మికులూ, అటు బాకీలు చెల్లించక రైతులూ అంతా ఊబిలో కూరుకు పొయ్యారు... అటు, ఇటు కాకుండా ఊగులాడుతోంది ఫ్యాక్టరీ.

ఆశ చావని కొంతమంది ఫ్యాక్టరీ పిలుస్తుందని ఎదురు చూస్తున్నారు. చాలామంది నెల్లూర్లో రిక్షాలు తొక్కుతూ, మూటలు మోస్తూ... రైసుమిల్లుల్లో కూలీలు గానూ నిలిచిపోతే, మరికొంతమంది పనిని వెతు క్కుంటూ తిరుపతికి పొయ్యారు. మరికొందరు పెళ్లాం పిల్లల్ని అనాథల్ని చేసి ఊళ్లుపట్టి పొయ్యారు.

గానుగాడేటప్పుడు పెట్టుకుంటామంటూ పని లేనప్పుడల్లా వర్కర్లని తీసిపారేయడం... మళ్లీ క్రషింగ్ టైమప్పుడు వేరేవాళ్లని పెట్టుకోవడం ఇదంతా మామూలే కానీ, ఈ విధంగా ఫ్యాక్టరీ అమ్మేసే పరిస్థితి వచ్చి ఉద్యోగస్థులంతా ఈదినిబడ్డం మాత్రం ఇప్పుడే చూస్తోంది రత్నమ్మ...

"గవర్నమెంటు సొమ్ముకి అమ్మా, అబ్బా ఎవురు బోన్నా," నీర్సంగా నిట్టూర్చాడు వెంకటేశ్వర్లు రవణయ్యని ఓదారుస్తూ.

గట్టిగా, చల్లగా వున్న మంచుకొండల్లో నడుస్తు న్నట్లుగా వుంది రత్నమ్మకి... ఎండిన చెరుకు గెణుపుల్లో నుండి ముళ్లేవో గుచ్చుకుంటున్నాయి. అయితే గుండెల్లో గుచ్చుకునే కనపడని ముళ్లకంటే యివేమంత బాధగా లేవు...

అనుకుంటాంగానీ ఈ ఆస్తులూ, అంతస్థులూ, వస్తువులూ అన్నీ ఈరోజుంటాయి, రేపు పోవచ్చు... కానీ మనిషి దూరమైతే మళ్లీ వస్తాడా?... దగ్గరున్నపుడు తెలీని కొత్త విలువలేవో మనసుని పిండుతున్నాయి.

కదలిక లేని సముద్రంలాంటి ఈ ఫ్యాక్టరీ లోపల కనపడని అలజడేదో వెంటాడుతున్నట్టుగా వుంది... హోరుగాలి వాళ్లిద్దర్నీ చుట్టేస్తూ దూసుకుపోతూంది.

తడబడుతూన్న కాళ్లతో, వొణుకుతూన్న చేతు లతో చుట్టూ చూసింది. నూట యాభై ఎకరాల విస్తీర్ణం గల ఆ ఫ్యాక్టరీలో ఎక్కడో ఒకచోట శవాల్లా తిరుగు తూన్న ఒకరిద్దరు తప్ప మనిషి జాడేమీ లేదు... కొడుకు కూడ తండ్రి కోసం కళ్లని దివిటీలు చేసుకుని వెతక సాగాడు.

'చక్కెర కర్మాగారము' అని రాసి వున్న పెద్దపెద్ద సిమెంటు అక్షరాల్లో నుండి 'క్కె...' అంటూ యింకా మవత్తు వంటివి రాలిపోయి వున్నాయి. అవన్నీ కూడి చదూతూంటే అంత దుఃఖంలోనూ రాఘవయ్య కొడుక్కి నవ్వొచ్చింది... 'చ... ర... కరాగారము.'

కాలేజీకి వెళ్లి వస్తున్నాడేగానీ తండ్రి పడుతోన్న మానసిక క్షోభ తెలీకుండా ఏంపోలేదు మురళికి... వద్దు వద్దనుకుంటూనే చెరుకేసి మళ్లీ అప్పుల్లో కూరుకు పొయ్యాడు. అందుక్కారణం ఫ్యాక్టరీ అన్న విషయం ఇప్పుడిప్పుడే తెలుస్తోందీతడికి...

ఈ ఫ్యాక్టరీ దివాలా తీయడానికి సరిగ్గా ముందు చెరుకుపంట పెట్టడం తండ్రి తప్పో, ఫ్యాక్టరీ తప్పో తెలీదుగానీ ఇప్పుడు నష్టపోయిందెవరు?... కాలేజీకి వెళ్లేంతవరకూ కూడ ఇక్కడ అప్పుడప్పుడూ కూలిపనికి వస్తూండేవాడు తను. అప్పుడు ఫ్యాక్టరీ మరీ ఇంత కళా విహీనంగా వుండేదికాదు. అప్పటి యం.డి. పోయాక చెరుకు ఉత్పత్తి తగ్గాక గాడి తప్పినట్లుంది. ఏ ఫ్యాక్టరీలో ఏం జరుగుతోందో సామాన్యుడికేం తెలుస్తుంది. ఏ కంపెనీ ఎందుకు మునుగుతుందో, ఎట్లా తేలుతుందో మామూలు మనిషికి ఎట్లా అవగతమవుతుంది...

వారంరోజుల్నుండీ ఇంటికి రాని తండ్రి గురించి ఎవర్ని వాకబు చేయాలో తెలీకుండా వుంది కొడుక్కి... అసలే అనారోగ్యంతో, ఆపై అప్పుల ఒత్తిడితో వడలి పోయి వున్న తండ్రి ఏమయిపోయాడోనని ఊర్లన్నీ తిరిగి తిరిగి వచ్చాడు మురళి తండ్రిని వెదుక్కుంటూ... ఒక వైపు దిగులూ, వేరొకవంక కోపమూ, అసహనమూ వాడ్ని నలిపేస్తున్నాయి...

చివరికి తల్లిపోరు పడలేక... ఇట్లా ఈ ఫ్యాక్టరీ వద్దకు...

హోరుమంటూన్న ఈదురుగాలి గుండెల్లో వొణుకు పుట్టిస్తూంది. అప్రయత్నంగా తల్లీకొడుకు లిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఏదో

శంకిస్తూ ఇద్దరి మనసులూ మాట్లాడుకున్నాయి. పెదవులు విప్పి మాట్లాడుకోవడానికి ఎవరికీ ధైర్యం చాల్లేదు. తార్రోడ్డు మీద పడిన గుంటల్లో నుండి మొలిచిన దుబ్బుల్లో నుండి, ఎండిన చెరుకుపిప్పిలో నుండి దారీ, దరీలేని లోతయిన సముద్రాన్ని ఈదుతున్నట్లుగా వుంది వారి పరిస్థితి...

దూరంగా గానుగాడే మిషను వున్న భవంతి ముందు ఒకరిద్దరు తచ్చాడుతున్నారు. ఊపిరొచ్చినట్టయింది రాఘవయ్య కొడుక్కి. ఫోర్‌మన్ సుబ్బారావు, హెల్పర్ వీరయ్య కుడివైపున్న బాయిలర్ రూము నుండి ఇటువైపుగా వస్తున్నారు. అడుగుపడని కాళ్లతో వున్నచోటే నిలబడి వాళ్లు వచ్చిందాకా ఎదురుచూసి అడిగాడు తండ్రి గురించి.

''ఎక్కడా?... కన్పించలేదే... మొన్నొకరోజు మాత్రం వచ్చి ముఖ్యమంత్రి ఫండ్‌లో నుండి డబ్బు లొస్తాయంట కదా... రైతులకి ఎప్పుడిస్తారని అడగతుణ్ణాడు... ఆ తర్వాత నేను చూడల్యా...'' చెప్పాడు వీరయ్య. ముఖ్యమంత్రిచ్చే డబ్బులు పెద్దపెద్ద రైతులకు, నోరుగల్లోళ్లకూ సరిపాయ... మనదాకా యాడొస్తుండాయి... నిట్టూర్చాడు లోలోపలే.

''ఒకర్నొకరు చూసేట్టుగా, ఒకర్నొకరు ఎతుక్కునేట్టుగా వుండాదా? ఎవురి పరిస్థితి వాడికే అర్థం కాకపాయ... అయోమయంగా వుండాది,'' ఖండించాడు ఫోర్‌మన్.

''కూతురింటికేమయినా బొయినాడేమొ చూడకూడదంటయ్యా...'' మనసొప్పక మళ్లీ అన్నాడు వీరయ్య. అతడికి రాఘవయ్య కొడుకుని చూస్తుంటే జాలిగా వుంది. దిగులు మేఘాలు కమ్ముకున్న వాడి ముఖంలో పదేళ్ల తన కొడుకు ఛాయలు కన్పిస్తున్నాయి. వీరయ్యకు తల తిరిగినట్లుగా అయింది ఆ తల్లీకొడుకుల్ని చూస్తుంటే.

అంతలోనే తేరుకుని ఇదేదీ పట్టకుండా హడావిడిగా వెళ్లిపోతూన్న ఫోర్‌మన్ వెనుక పెద్దపెద్ద అంగలేసుకుంటూ వెళ్లిపోయాడతడు... నడిసంద్రంలో అనుకోకుండా చేతికి దొరికిన చిన్న కొయ్యముక్కేదో జారిపోయినట్లుగా సుదీర్ఘంగా నిట్టూర్చి మళ్లీ కొడుకు వంక చూసింది రత్నమ్మ.

''కావు... కావు...'' మంటూ కాకుల గుంపొకటి కర్మాగారం మీదుగా ఎగురుకుంటూ పోయింది... గుండెల్లో పుట్టిన గుబులుని అణుచుకుంటూ ఫ్యాక్టరీ ముందూ, వెనుకా, పైనా, కిందా అంతా వెతుక్కుంటూ తిరుగుతున్నారిద్దరూ... క్రష్షింగు ప్లాంటు వున్న పెద్ద షెడ్డు వెనుకవైపున, జీలగచెట్ల నడుమ పాత సిమెంటు బెంచి మీద వెల్లకిలా పడున్నాడు రాఘవయ్య.

ఒక కాలు బెంచి మీది నుండి కిందికి వేళ్లాడుతోంది.

చేతులు రెండూ ఎడాపెడా పడి వున్నాయి...

షెడ్డు కవతల ప్రహరీ గోడనానుకుని గుబురుగా పెరిగి వున్న జీలకచెట్లకి అల్లుకుని వున్న పిచ్చిదొండ తీగ బెంచి మీదికి కూడ పాకి వుంది... క్రష్షింగు ప్లాంటు గోడమీది నుండి చలిచీమలు బారుపెట్టి అత్యవసరమైన పనులమీద తిరుగుతున్నట్లుగా ఎడాపెడా పారాడుతున్నాయి... ఎండిపోయిన చెరుకు ద్రవాన్ని నాకడానికి కుక్కపిల్ల ఒకటి తనుకులాడుతోంది...

రాఘవయ్యని స్పష్టంగా చూడకుండానే గుండెలు జారిపోయాయి రత్నమ్మకి. అడుగు కూడ కదల్లేనట్లుగా ఉన్నచోటనే కూలబడిపోయింది.

జీవితపు మొదటి మెట్టు మీద అడుగుపెడుతోన్న మురళి గుండెనెవరో అరచేత్తో పిసికినట్టయింది.

ఎక్కడో దూరతీరాల్లో నుండి పిలుస్తున్నట్లు, లోతుగా సన్నని మూలుగు... తడబడుతూ తండ్రి మీదుగా వొంగి చూశాడు కొడుకు.

హంతకుడి జాడ తెలిపే మరణానంతర వాంగ్మూలమేదో ఇవ్వడానికి సిద్ధపడుతున్నట్లుగా అతడి పెదవులు విచ్చుకుని వున్నాయి.

ఎక్కడ్నుండో వినిపిస్తూన్న కీచురాళ్ల శబ్దం దారీ తెన్నూ గానక విషాదంగా కర్మాగారం పాడుతోన్న నిశ్శబ్ద సంగీతంతో కలిసిపోయి వికృతంగా విన్పిస్తోంది.

*అరుణతార, డిసెంబర్ 2004*

